క్లుప్తంగా

డీటీ చలమయ్యకు సత్కారం



పెదకాకాని: అంకిత భావంతో విధులు నిర్వహించినపుడు సమాజంలో ఉత్తమ వ్యక్తులుగా గౌరవించబడతామని తహసీల్దార్ పెల్లూరి రత్నం అన్నారు. పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం రాత్రి ఉద్యోగ విరమణ చేస్తున్న చలమయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి డెప్యూటీ తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర అధ్యక్షత వహించారు. తహసీల్దార్ పి.రత్నం మాట్లాడుతూ పెదకాకానిలో ఐదేళ్లుగా పనిచేసిన చలమయ్య ప్రజల నుంచి ఉత్తమ ఉద్యోగిగా మన్ననలు పొందారన్నారు. ప్రతి ఉద్యోగికీ జీవితంలో బదిలీలు, ఉద్యోగ విరమణలు సర్వసాధారణమన్నారు. ఆయన శేష జీవితం సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్ చలమయ్యను పుష్పమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్వేయర్ నాగరాజు పాల్గొన్నారు.

శాకంబరిగా గంగానమ్మతల్లి



శలపాడు(చేబ్రోలు): చేబ్రోలు మండలం శలపాడులోని గ్రామదేవత గంగానమ్మతల్లి శుక్రవారం శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా శుక్రవారం గంగానమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు విశేష కార్యక్రమాలు జరిగాయి. గ్రామంలోని మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. వివిధ రకాల కూరగాయలతో గంగానమ్మ తల్లి శాకంబరిగా దర్శనమివ్వటంతో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొన్నారు. ఆలయ పూజారి వడ్లమూడి శ్రీనివాసరావు పూజలు నిర్వహించారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై అపోహలు వద్దు



ప్రత్తిపాడు: బీసీజీ వ్యాక్సిన్‌పై ప్రజలు అపోహలు వీడలని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి మేరీ యునిస్ అన్నారు. మండల పరిధిలోని గనికపూడిలో జరుగుతున్న బీసీజీ వ్యాక్సినేషన్‌ను శుక్రవారం పరిశీలించారు. ప్రజలతో మాట్లాడారు. వ్యాక్సిన్ వలన కలిగే ప్రయోజనాలు, వేయించుకోకపోవడం వలన ఎదురయ్యే అనర్థాలను వివరించారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లతో కలసి ఇంటింటికీ వెళ్లి వారిని ఒప్పించి వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మేరియునిస్ మాట్లాడుతూ కరోనా వ్యాక్సిన్‌కు బీసీజీ వ్యాక్సిన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. కేవలం టీబీని నివారించేందుకు మాత్రమే బీసీజీ వ్యాక్సిన్‌ను వేయడం జరుగుతుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వ్యాక్సిన్ వేయించుకోవాలని డాక్టర్ కోరారు. వెంట ఎంపీహెచ్‌ఈవో చెల్లమ్మ, పిహెచ్‌ఎన్ నిర్మల, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సాత్విక పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఒకరిపై కేసు

చేబ్రోలు: మండలం నారాకోడూరు గ్రామానికి చెందిన సిమెంటు డెలివరి బాయ్‌పై దాడి చేసి గాయపరిచిన ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నారాకోడూరు గ్రామానికి చెందిన వేల్పూరి వెంకటేష్, స్థానిక సిమెంటు షాపులో డెలివరి బాయ్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక దళితవాడ ప్రాంతంలో ఆటోలో సిమెంటు బస్తాలు డెలివరి చేయటానికి వెళ్లిన వెంకటేష్‌ను ముగ్గురు యువకులు దాడి చేసి గాయపరిచారు. గాయాలైన బాధితుడు వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. వెంకటేష్ ఫిర్యాదు మేరకు చేబ్రోలు పీఎస్ హెచ్‌సీ హరిబాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహన సదస్సు

మేడికొండూరు: మండలంలోని యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్య అభ్యసించాలన్నారు. లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదలతో సాధించాలని కోరారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాల సెక్రటరీ ఫాదర్ పి.బాలస్వామి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యం దిశగా ఇష్టంతో చదివి ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్.కేశవరెడ్డి, ఎస్సై చల్లా వాసు, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ రమేష్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మర్రెడ్డి పాల్గొన్నారు.

పేదల ఇంట పప్పులుడకవ్

- రేషన్‌లో కందిపప్పు, పంచదారకు కోత
- ఆహార భద్రతకు తూట్లు పొడుస్తున్న కూటమి సర్కార్
- కార్డుదారులకు మూడు నెలలుగా బియ్యంతోనే సరి



ప్రత్తిపాడులో ఎండీయూ వాహనాల ద్వారా కార్డు దారులకు పంపిణీ చేస్తున్న బియ్యం

ప్రత్తిపాడు: పేదల ఇంట పప్పులుడకడం లేదు. కూటమి ప్రభుత్వం చెప్పే మాటలు కోటలు దాటుతుంటే.. చేతలు మాత్రం కోతలు పెడుతున్నాయి. ఆహార భద్రతకు తూట్లు పడుతున్నాయి. చౌకదుకాణాలు, ఎండీయూ వాహనాల ద్వారా పేదలకు సరఫరా చేసే నిత్యావసర సరుకుల్లో కోత పెడుతోంది. కందిపప్పు, పంచదారలకు ప్రభుత్వం మంగళం పాడేసింది. ప్రజాపంపిణీ వ్యవస్థ అంటే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి తక్కువ ధరకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయడమే. కానీ కూటమి ప్రభుత్వం ఈ భారాన్ని కూడా తగ్గించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా కనిపిస్తుంది. గడిచిన రెండు నెలలుగా జూన్, జూలై మాసాల్లో కందిపప్పు, పంచదారల సరఫరా నిలిపివేసింది. తాజాగా ఆగస్టు నెల అయినా తమ ఇంట పప్పులుడుకుతాయని, నోరు తీపి అవుతుందని భావించిన పేదలకు ఈ నెలా భంగపాటు తప్పలేదు.

బియ్యంతో సరి..

ఎన్నికలకు ముందు వరకు ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం, కందిపప్పు, పంచదారలను పేదలకు పంపిణీ చేసేవారు. కానీ గడిచిన రెండు నెలలుగా బియ్యం పంపిణీతో సరిపెడుతున్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని పౌరసరఫరాల గిడ్డంగి నుంచి ప్రతి నెలా ప్రత్తిపాడు మండలంలోని 38 దుకాణాలకు 280 టన్నులు, పెదనందిపాడు మండలంలోని 28 దుకాణాలకు గాను 175 టన్నులు, గుంటూరు రూరల్ మండలంలోని ఒక దుకాణానికి గాను 22 టన్నులు, కాకుమాను మండలంలోని 8 దుకాణాలకు గాను 46 టన్నులు, వట్టిచెరుకూరు మండలంలోని 6 దుకాణాలకు గాను 30 టన్నుల బియ్యంను సరఫరా చేస్తారు.

రేషన్ కార్డుల వివరాలు..	
ప్రత్తిపాడు మండలం	15,825
పెదనందిపాడు మండలం	13,625
కాకుమాను మండలం	14,106
వట్టిచెరుకూరు మండలం	15,232
గుంటూరురూరల్ మండలం	85,082

కందిపప్పు.. పంచదారలకు మంగళం..

ప్రత్తిపాడు సివిల్ సప్లెస్ గోడౌన్ పరిధిలోని కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేయాలంటే నెలకు సుమారు 30 టన్నులు, పంచదార 30 టన్నులు అవసరం ఉంటుంది. ఒక్కో కార్డుదారునికి అరకిలో పంచదార రూ.17, కిలో కందిపప్పును రూ.67కు అందిస్తారు. కానీ ప్రభుత్వం రెండు సరుకులనూ రెండు నెలలుగా సరఫరా చేయకపోవడంతో కార్డుదారులకు ఇబ్బందులు తప్పడంలేదు.

తక్కువ ధరకూ 'లిమిట్'గానే..

బహిరంగ మార్కెట్‌లో కిలో పంచదార రూ.155 నుండి రూ.160 వరకు విక్రయిస్తున్నారు. పంచదార అయితే కిలో 40 నుండి 42 వరకు ఉంది. ప్రభుత్వం సెలెక్టెడ్ దుకాణాల్లో తక్కువ ధరకే కందిపప్పు అందించేలా ఏర్పాట్లు చేశామని చెబుతున్నప్పటికీ, అక్కడ కూడా 'లిమిట్' పాటిస్తుండటం, ప్రజలకు ఒక్కో కిలో వరకే రూ.150 కు అందిస్తుండటం, అది కూడా లిమిటెడ్‌గా పాతిక యాభై కేజీలు మాత్రమే రోజుకు అందిస్తుండటంతో ప్రజలపై ఆర్థిక భారం తప్పడం లేదు. పట్టించుకోవాల్సిన సివిల్ సప్లెస్ అధికారులే వ్యాపారులకు 'లిమిట్' సలహా ఇచ్చి మరీ ప్రజల నెత్తిన భారం మోపుతున్నారు.

> **రెండు నెలలుగా సరఫరా చేయలేదు**
>
> జూన్, జూలై రెండు నెలలుగా పంచదార, కందిపప్పులను సరఫరా చేయలేదు. ఈ నెల కూడా స్టాక్ రాలేదు. బియ్యం వరకే స్టాక్ వచ్చాయి. వాటి వరకు రేషన్ దుకాణాలకు పంపించాం.
>
> – అల్తెఖ్య, ఇన్‌చార్జి, పౌరసరఫరాల గిడ్డంగి, ప్రత్తిపాడు

చలపతి ఫార్మసీలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



రిబ్బన్ కట్‌చేసి ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఏఎన్‌యూ వీసీ ప్రొఫెసర్ గంగాధర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు రూరల్: ప్రపంచం యావత్ భారతదేశం వైపు చూడటానికి కారణం నాణ్యమైన పరిశోధనలేనని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.గంగాధర్ తెలిపారు. నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో కళాశాల, మోతడకలోని చలపతి ఫార్మసీ కళాశాల సంయుక్తంగా రెండు రోజులపాటు నిర్వహించనున్న 17వ ఫార్మసీ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన శుక్రవారం ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో ఫార్మాసిస్టుల ఎంతో అవసరమని తెలిపారు. ఎటువంటి సమయంలోనైనా సంక్షోభంలేని ఒకే ఒక రంగం ఫార్మసీ రంగమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి గొప్ప పారిశ్రామిక వేత్తలుగా, పరిశోధకులుగా, వ్యాపారవేత్తలుగా, వివిధ రంగాల్లో స్థిరపడి దేశానికి సేవ చేయాలని కోరారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ భారత దేశం ఔషధాలను ఎగుమతి చేసే స్థాయికి ఫార్మసీ రంగం అభివృద్ధి చెందినట్లు చెప్పారు. అందుకు ఉదాహరణ కోవిడ్ వ్యాక్సిన్ అని తెలిపారు. శ్రీచైతన్య విద్యాసంస్థల అసిస్టెంట్ మేనేజర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా జీవన సరళిని మార్చుకోవాలన్నారు. గుంటూరు కెమిస్ట్ డ్రగిస్ట్ అసోసియేషన్ సెక్రటరీ కె.చంద్రశేఖర్, నెల్లూరు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ శర్మ, చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడారు. ప్రదర్శనలో సుమారు 228 స్టాల్స్‌ను 481 మంది విద్యార్థులు ఏర్పాటు చేశారు. మొదటి రోజు 3200 మంది విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకించారు. శనివారం ఈ ప్రదర్శన కొనసాగనుంది.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి

కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు



శలపాడులో కౌలు రైతుల నుంచి సంతకాలు సేకరిస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

చేబ్రోలు: భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, తద్వారా పంట రుణాలు, అన్నదాత సుఖీభవ అందించాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం చేబ్రోలు మండలం శలపాడులో శుక్రవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంతకాలను త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రికి అందజేయనున్నట్లు తెలిపారు. బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు రావలంటే ప్రస్తుతం ఉన్న సీసీఆర్సీ చట్టాన్ని రద్దు చేసి భూ యజమాని అంగీకారంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు నేరుగా గ్రామ సభల ద్వారా ప్రభుత్వమే గుర్తించాలని సూచించారు. ఈ ఖరీఫ్ లో పెట్టుబడులు పెట్టుకోవటానికి వెంటనే అన్నదాత సుఖీభవ ద్వారా రైతులు, కౌలు రైతులకు పెట్టుబడి సహాయం అందించాలని కోరారు. కౌలు రైతుల సమస్య పరిష్కారం కోసం త్వరలో కార్యాచరణను ప్రకటిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు వాకా ఏడుకొండలు, బి.నరసింహారావు, వాకా శివయ్య పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించడం సురక్షితం

నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ వంశీధర్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ వంశీధర్

గుంటూరు రూరల్: హెల్మెట్ ధరించి ప్రతి ఒక్కరూ సురక్షితంగా ప్రయాణించాలని నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ కె.వంశీధర్ తెలిపారు. శుక్రవారం గోరంట్ల గ్రామంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో విద్యార్థులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించటం, వాహనాలు నడిపే సమయంలో వాహన చోదకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య మాట్లాడుతూ ప్రతి పౌరుడు, పౌరురాలు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని, ప్రయాణాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారు ప్రయాణాల్లో సీటు బెల్ట్ ధరించాలని ప్రభుత్వ నిబంధనలు, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, పీడీ జి బాలశౌరిరెడ్డి, ఏపీడీ కె సుస్మిత, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ ఐ ఆదిలక్ష్మి, పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేద్దాం



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో దేశ ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు అమ్మ కోసం ఒక మొక్క నాటడం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రజలతో కలసి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ప్రాథమిక వైద్యశాలలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల వైద్య సేవలను గ్రామ ప్రజలకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం గురించి బాలింతలకు అందిస్తున్న సదుపాయాల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి నామా శ్రీనివాస్, బీజేపీ గుంటూరు రూరల్ మండల అధ్యక్షుడు కంచర్ల రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు అవుల రామకోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్‌గౌడ్, జిల్లా ఆఫీసు ఇన్‌చార్జి పద్మనాభం, నాయకురాలు శ్రీమతి పాండ్రంగి లక్ష్మి, సుకన్య, గ్రామ మాజీ ఉపసర్పంచి వంగా నవీన్‌రెడ్డి, పండ్రంగి పానయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతి ఆధారంగా బోధన చేపట్టాలి

అప్పాపురం(కాకుమాను): విద్యార్థుల ప్రగతి ఆధారంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని అప్పాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కెనడీ మాట్లాడుతూ ప్రతి తరగతిలో విద్యార్థుల ప్రగతిని గుర్తించి వారి వారి సామర్థ్యాలను బట్టి బోధన చేయాలని సూచించారు.

గేదెల చోరీ కేసులో మైనర్ సహా నలుగురి అరెస్టు

తాడికొండ: తుళ్ళూరు మండలంలో జరిగిన గేదెల దొంగతనం కేసులో ఒక మైనర్ సహా నలుగుర్ని అరెస్టు చేసినట్లు తుళ్ళూరు ఎస్ఐ వేణుగోపాల్ తెలిపారు. దర్యాప్తులో అనంతరం అమరావతి మండలం కర్లపూడి గ్రామానికి చెందిన తేలుకుట్ల గోపి, మేడా వెంకటేష్, అంగర లక్ష్మీనారాయణ, ఓ బాలుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

8న పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నిక

పొన్నూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ(పాఠశాల యాజమాన్య కమిటీలు) ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన మండలంలోని 88 ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీలను ఎన్నుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 8న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తల్లిదండ్రుల కమిటీ సభ్యుల ఎన్నిక, అనంతరం తల్లిదండ్రుల కమిటీ సభ్యుల జాబితా ప్రకటించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి తల్లిదండ్రుల కమిటీ సభ్యులతో అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహించనున్నా. మధ్యాహ్నం 2 గంటల నుంచి సభ్యుల ప్రమాణ స్వీకారం, అనంతరం పాఠశాల నూతన తల్లిదండ్రుల కమిటీ మొదటి సమావేశం నిర్వహించనున్నారు.

ఒక్కో తరగతి నుంచి ముగ్గురు

ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఓటర్లుగా ఉంటారు. వారు మాత్రమే అక్కడ పోటీ చేయాల్సి ఉంటుంది. ప్రతి తరగతి గది నుంచి ముగ్గురు సభ్యులను ముందుగా ఎన్నుకుంటారు. ప్రాథమిక పాఠశాలల్లో 15 మంది, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 21 మంది, ఉన్నత పాఠశాలల్లో 15 మంది చొప్పున సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తారు. ఆయా కమిటీలు చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. వీరితో పాటు ఎక్స్‌అఫీసియో సభ్యులుగా ఆరుగురిని ఎన్నుకుంటారు.

> **ఎన్నికలకు సర్వం సిద్ధం**
>
> మండలంలోని అన్ని పాఠశాలల్లో నూతన తల్లిదండ్రుల కమిటీలను ఏర్పాటు చేసేందుకు తగిన ఏర్పాట్లు పూర్తిచేశాం. అన్ని పాఠశాలల్లో నోటిఫికేషన్లు అందజేశాం. ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు చేపడుతున్నాం.
>
> – శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ, పొన్నూరు

ప్రతి కార్యకర్తకు అండగా వైఎస్సార్ సీపీ

అంబటి మురళీకృష్ణ



మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ఐదేళ్ల పాలనలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకతీతంగా నవరత్నాల పేరుతో పథకాలను అందించి సంక్షేమ పాలన అందిస్తే, కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని వీడి రాష్ట్రంలో దౌర్జన్య పాలన సాగిస్తోందని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎన్నికల ఫలితాల అనంతరం కూటమి నేతలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను పక్కనపెట్టి, కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కార్యకర్తలకు ఆర్థికంగా ఇబ్బందులు కలిగించే చర్యలకు పాల్పడటం పాలకుల లక్షణం కాదని అన్నారు. కార్యకర్తలందరూ ధైర్యంగా ఉండాలని, పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీపీ భవనం పద్మలీల, వైఎస్సార్ సీపీ నాయకులు సోమన్న దొర, ఆకుల వెంకటేశ్వరరావు, ఎంపీపీ భవనం పద్మలీల, అంబటి వెంకటేశ్వరరావు, షేక్. నాజర్, వట్టిప్రోలు రంగారావు, షేక్. సుభాని, ఆకుల రామ్మోహన్, అమిరినేని సాంబశివరావు, దేవరకొండ గోపి, మూర్తిరాజు, దాసరి మురళీకృష్ణ పాల్గొన్నారు.

తల్లిపాలపై మహిళలకు అవగాహన



గనికపూడిలో తల్లిపాల ఆవశ్యకతపై ప్రతిజ్ఞ

ప్రత్తిపాడు: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

- ప్రత్తిపాడులోని రామానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో 'అంతరాలను పూరించి- తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం' అంటూ అంగన్‌వాడీ కార్యకర్త టి. జ్యోతిరాణి ఆధ్వర్యంలో తల్లులకు అవగాహన కల్పించారు.
- ప్రత్తిపాడు సెక్టారులోని చినకోండ్రుపాడు గంగమ్మగుడి సెంటరులో వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త సీహెచ్ నాగమణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తల్లిపాలపై మహిళలు, గర్భవతులకు అవగాహన కల్పించారు.
- గొట్టిపాడు సెక్టారులోని గనికపూడిలో వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను జరిపారు. తొలుత పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మేరియునిస్, ఎంపీహెచ్‌ఈవో చెల్లమ్మలు తల్లిపాల ఆవశ్యకతపై ప్రతిజ్ఞ చేశారు. పిహెచ్ఎన్ నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు షేక్ బాబి బతుల్, అరుణ, ఏఎన్‌ఎం అనిత పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

చేబ్రోలు: హోటల్ ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని అపహరించిన ఘటన మండలంలోని నారాకోడూరులో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు నల్లపాడుకు చెందిన బృందావనం విష్ణు పనుల నిమిత్తం తెనాలి వెళ్లి తిరిగి వస్తూ నారాకోడూరులోని ఉమా హోటల్ ఎదురుగా హోండా యాక్టివాను నిలుపదల చేశాడు. హోటల్‌లోకి వెళ్లి టిఫిన్ చేసి వచ్చే సమయానికి వాహనం మాయమైంది. జరిగిన ఘటనపై చేబ్రోలు పోలీసు స్టేషన్ హెచ్‌సీ హరిబాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెండేళ్లలో పంచాయతీలొస్తాయి..

ఎలక్షన్లు ఉండవ్.. అన్నీ ఏకగ్రీవాలే

- సర్పంచులు సంతకాలు చేయకున్నా ఎలా అభివృద్ధి చేయాలో మాకు తెలుసు
- మా పరిపాలన అంతా పార్టీ గ్రామ అధ్యక్షులు, యూనిట్ అధ్యక్షులు, బూత్ ఇన్‌చార్జిలే
- ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



ఎమ్మెల్యే ఎదుట బాహాబాహీకి దిగిన తెలుగు తమ్ముళ్లు

ప్రత్తిపాడు: రెండేళ్ల తరువాత పంచాయతీలొస్తాయి. ఎలక్షన్లు ఉండవు. అన్నీ ఏకగ్రీవాలే అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. వట్టిచెరుకూరు మండల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు హాజరై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఓ గ్రామ సర్పంచి వర్గానికి, టీడీపీ గ్రామ ప్రెసిడెంట్ వర్గానికి మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బూర్ల పలు వ్యాఖ్యలు చేశారు. ఆయన ఏం మాట్లాడారంటే.. 'ఏ పార్టీ సంబంధించిన వారైనా ఆ సర్పంచికి గౌరవం ఇస్తాం. కానీ ఇక్కడ సర్పంచి అనే వ్యక్తి ఆ గ్రామ సర్పంచిగా యాక్ట్ చేయాలి తప్ప, ఒక వర్గానికి కొమ్ము కాస్తే ఆయన్ను కూడా మరోసారి పిలవం.. నేను ముందే చెబుతున్నా.. మా పరిపాలన అంతా కూడా పార్టీ గ్రామ అధ్యక్షులు, జనసేన, తెలుగుదేశం, యూనిట్ అధ్యక్షులు' వీళ్లే మాకు ముఖ్యం. కానీ సర్పంచులను గౌరవిస్తా. ఎందుకంటే పార్టీలకతీతంగా ప్రజలెన్నుకున్నటువంటి వ్యక్తి. బట్ ఆయన ఇక్కడ ఉన్నప్పుడు సముదాయించుకుని, రెండు వర్గాలకి న్యాయం చేసేవాడిగా ఉండాలి తప్ప ఒక వర్గానికి ఎంకరేజ్ చేసే వాళ్లుగా ఉంటే ఆ సర్పంచ్‌ను ఈసారి పిలవరు. మీరు సంతకాలు పెట్టినా పెట్టకపోయినా ఎలా అభివృద్ధి చేయాలో నాకు తెలుసు. దయచేసి వర్గాలనేది లేదు. ఐదేళ్ల తరువాత ఎలక్షన్లు. గ్రామాలు ప్రశాంతంగా ఉండాలి. అభివృద్ధి వైపు అడుగులు వేయాలి. పిల్లలు చదువుకోవాలి. అభివృద్ధి కార్యక్రమాలు జరగాలి. రెండేళ్ల తరువాత పంచాయతీలు వస్తాయి. పంచాయతీల్లో ఎలక్షన్లు ఉండవు. ఏకగ్రీవాలే ఉంటాయి' అంటూ చేసిన వ్యాఖ్యలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి.

డిష్యుం డిష్యుం..

ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సమక్షంలోనే తెలుగు తమ్ముళ్లు బాహాబాహీకి దిగారు. శాఖల వారీగా అధికారులతో సమీక్షిస్తున్న సమయంలో కాట్రపాడు సర్పంచి ఎం.శివశంకర్ తమ గ్రామానికి సంబంధించిన సీసీ రోడ్ల నిర్మాణ విషయాన్ని ఎమ్మెల్యే వద్ద ప్రస్తావించారు. సర్పంచిగా నేను ప్రపోజ్ చేసిన రోడ్డు మంజూరు కాలేదని, పార్టీ గ్రామ అధ్యక్షులు చేసిన రోడ్లు మంజూరయ్యాయని అన్నారు. అదే సమయంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎం.సాంబయ్య కలుగజేసుకోవడంతో ఇరు వర్గాలకు మధ్య తీవ్ర వాగ్వాదం చేసుకుంది. మాటా మాటా పెరగడంతో ఎమ్మెల్యే ఎదుటనే బాహాబాహీకి దిగారు. ఒకరికొకరు తోసుకున్నారు. ఇంతలో పోలీసులు కలుగజేసుకుని సర్పంచి వర్గాన్ని బయటకు తీసుకురావడంతో పరిస్థితి సద్దుమణిగింది. అనంతరం ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు.

గ్రామాల అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలి

ప్రత్తిపాడు: గ్రామాల అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో అధికారులతో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు త్వరలో వెయ్యి కోట్ల నిధులు మంజూరవుతాయని, ప్రాధాన్యత ప్రకారం పనులు చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

ఉరి వేసుకుని ఒడిశా వాసి ఆత్మహత్య



ప్రత్తిపాడు: ఉరి వేసుకుని ఒడిశా వాసి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. జగదీష్ స్త్రైన్(38) ఎనిమిదేళ్ల కిందట బతుకుదెరువు కోసం గుంటూరు జిల్లాకు వచ్చాడు. అప్పటి నుంచి జిల్లాలోని తెనాలి ప్రాంతంలో మిల్లులకు కూలీలను కాంట్రాక్టు పద్ధతిన పనులకు తీసుకువెళుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల కిందట ప్రత్తిపాడు మండలంలోని ఓ మిల్లులో కాంట్రాక్టు మాట్లాడుకోవడానికి తుమ్మలపాలెంలోని తన స్నేహితుడు రాజు ఇంటికి జగదీష్ వచ్చాడు. మూడు రోజులుగా స్నేహితుడి ఇంట్లోనే ఉంటూ అక్కడే ఉంటూ ఫుల్లుగా మద్యం తాగాడు. ఈ నెల ఒకటో తేదీన గదిలో కిటికీకి దుప్పటితో ఉరివేసుకుని వేలాడుతూ ఉండటాన్ని గమనించిన, స్థానికులు జగదీష్‌ను కాటూరి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు మృతుడి సోదరుడు కల్పతరు స్త్రైన్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.